సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
గురువారం। 1। జూన్। 2023



పొగాకు వ్యతిరేక దినోత్సవ ర్యాలీ

ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని సంతపేటలో ఉన్న జీఈడీ కాలేజీ నుంచి జిల్లా వైద్యశాఖ కార్యాలయం వరకు ర్యాలీ జరిగింది. 8లో



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.62,150
22 క్యారెట్ల ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,581
3 శాతం జీఎస్టీతో	రూ.5,748
నవర (8 గ్రా)	రూ.45,984

గరిష్టం/కనిష్టం
39.0 /27.0

వాతావరణం

జిల్లా వ్యాప్తంగా బుధవారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. గాలిలో 89 శాతం తేమ ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలియజేశారు.

న్యూస్‌రీల్

విస్తృతంగా వాహనాల రికార్డుల పరిశీలన

- ట్రావెల్స్ బస్సుకు రూ.5.70 లక్షల జరిమానా



రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

నెల్లూరు(టౌన్): రవాణా శాఖ ఉప రవాణా కమిషనర్ బి.చందర్ ఆదేశాలతో బుధవారం అధికారులు పలు ప్రాంతాల్లో వాహనాల రికార్డులు పరిశీలించారు. హైదరాబాద్ నుంచి నెల్లూరుకు వస్తున్న కావేరి ట్రావెల్స్ బస్సును పెన్నా వంతెనపై తనిఖీ చేశారు. త్రైమాసిక పన్ను చెల్లించకపోవడం, పర్మిట్ లేకపోవడంపై రూ.5.70 లక్షల జరిమానా వసూలు చేశారు. ఇంకా పలు ప్రాంతాల్లో వాహనాలను ఆపి పొల్యూషన్ సర్టిఫికెట్, ట్యాక్స్ చెల్లింపు తదితరాల గురించి ఆరాతీశారు. ఎంవీఐలు బాలమురళీకృష్ణ, కార్తీక్ పవన్, షేక్ బాబు, ఏఎంవీఐలు స్వప్నీల్‌రెడ్డి, రఘువర్ధన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.


విత్తన విక్రయ దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు



రికార్డులు పరిశీలిస్తున్న ఇన్‌స్పెక్టర్ సుధాకర్‌రెడ్డి

నెల్లూరు(క్రైమ్): కావలి, బుచ్చిరెడ్డిపాళెంలోని ఆరు విత్తన విక్రయ దుకాణాల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బుధవారం తనిఖీలు నిర్వహించారు. కావలిలోని శ్రీగణేష్ ట్రేడర్స్, శ్రీబాలాజీ సీడ్స్ అండ్ పెస్టిసైడ్స్ దుకాణాల్లో రికార్డులు సక్రమంగా నిర్వహించకుండా, ధరల పట్టిక అందుబాటులో ఉంచకుండా వ్యాపారాలు చేస్తుండడాన్ని గుర్తించారు. దీంతో ఆయా షాపుల్లోని రూ.6,35,242 విలువ చేసే 10.32 క్వింటాళ్ల వివిధ రకాల విత్తనాలను అమ్మరాదని నోటీసులు జారీ చేశారు. తనిఖీల్లో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్లు సి.మాణిక్యరావు, వి.సుధాకర్‌రెడ్డి, ఇన్‌చార్జి వ్యవసాయాధికారి బి.వెంకటరెడ్డి, ఎఫ్ఆర్ఓ కె.గోపాలకృష్ణ పాల్గొన్నారు.

సోమశిలలో 41.091 టీఎంసీలు



సోమశిలలో నీటి నిల్వ (ఫైల్)

చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో బుధవారం సాయంత్రానికి 41.091 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 175 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం వచ్చి చేరుతోంది. కాగా పెన్నార్ డెల్టాకు 3,700 క్యూసెక్కులు, ఉత్తర కాలువకు 230, దక్షిణ కాలువకు 200, కండలేరుకు 100 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయంలో నీటి మట్టం 94.431 మీటర్లు ఉంది.

నేటి నుంచి ఇంటర్ కళాశాలల పునః ప్రారంభం

నెల్లూరు(టౌన్): వేసవి సెలవుల అనంతరం విద్యార్థులు జూనియర్ కళాశాలల బాట పట్టనున్నారు. పబ్లిక్ పరీక్షలు ముగిసిన అనంతరం ఏప్రిల్ 28వ తేదీ నుంచి రాష్ట్ర ప్రభుత్వం సెలవులు ప్రకటించింది. గురువారం జూనియర్ కళాశాలలు పునః ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ఆయా కాలేజీలను సిద్ధం చేసే పనిలో ప్రిన్సిపల్స్, అధ్యాపకులున్నారు. జిల్లాలో 210 ప్రభుత్వ, ప్రయివేట్ జూనియర్ కళాశాలలున్నాయి. ప్రథమ సంవత్సరానికి సంబంధించి తొలివిడత అడ్మిషన్ల గడువు ఈనెల 26వ తేదీ వరకు ఉంది. కాగా ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు గురువారంతో ముగియనున్నాయి.

మెరిట్ జాబితా విడుదల

నెల్లూరు(అర్బన్): వైద్యశాఖలోని ఎన్‌హెచ్ఎం విభాగంలో ఖాళీగా ఉన్న న్యూట్రిషన్ కౌన్సిలర్ పోస్టులకు ఇటీవల దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ప్రొవిజనల్ మెరిట్ జాబితాను విడుదల చేశామని ఇన్‌చార్జి డీఎంహెచ్ఓ వెంకటప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలను ఎస్పీఎస్‌నెల్లూరు.ఏపీ.జీఓవీ.ఇన్/నోటీస్/రిక్రూట్‌మెంట్ అనే వెబ్‌సైట్‌లో ఉంచామన్నారు. అభ్యర్థులు పరిశీలించుకుని అభ్యంతరాలుంటే ఈనెల 2వ తేదీలోపు తెలియజేయాలని కోరారు.

అక్రమ తవ్వకాలకు చెక్

ప్రకృతి వనరులు కొల్లగొడుతున్న వారిపై ప్రభుత్వం కన్నెర్ర చేసింది. ప్రభుత్వాదాయానికి గండి కొడుతున్న అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకుంటోంది. కొందరు వ్యక్తులు అక్రమంగా గ్రావెల్ తదితరాలను తవ్వి తరలిస్తున్నారన్న సమాచారంతో మైనింగ్ అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తూ కేసులు నమోదు చేస్తున్నారు. అనుమతి లేకుండా తవ్వకాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

విస్తృతంగా తనిఖీలు చేస్తున్న అధికారులు

- సీరియస్‌గా తీసుకున్న ప్రభుత్వం
- ఇప్పటి వరకు 24 కేసుల నమోదు
- రెవెన్యూ అధికారుల సహాయ నిరాకరణ





కావలి సమీపంలోని రుద్రకోట వద్ద పరిశీలిస్తున్న మైనింగ్ అధికారులు

నెల్లూరు(సెంట్రల్): అనుమతి లేకుండా క్వార్ట్జ్ గ్రావెల్, మట్టిని అక్రమంగా తవ్వి రవాణా చేస్తున్న వారిపై ప్రభుత్వం సీరియస్ కావడంతో మైనింగ్ శాఖ అప్రమత్తమైంది. ఆ శాఖ అధికారులు విస్తృతంగా దాడులు చేస్తున్నారు. ఇటీవల కాలంలోనే 24 కేసులు నమోదు చేసి రూ.3 లక్షల వరకు జరిమానా విధించారు. ప్రధానంగా సైదాపురం, వింజమూరు, కావలి, కలిగిరి ప్రాంతాల్లో ఎక్కువగా గ్రావెల్ తదితరాలను అక్రమంగా తవ్వి తరలిస్తున్నట్లు మైనింగ్ అధికారులు గుర్తిస్తున్నారు.

వారి సహకారం లేదు

పలుచోట్ల రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలకు సంబంధించిన స్థలాల్లో గ్రావెల్ తవ్వకాలు చేసినట్లు అధికారులు గుర్తించారు. మైనింగ్ అధికారులతోపాటు, ఆ శాఖ విజిలెన్స్ అధికారులు కూడా వాటిని పరిశీలించారు. ఇటీవల కలిగిరి ప్రాంతంలోని ఓ రిజర్వాయర్ వద్ద అక్రమంగా రాయి, గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్నట్లు మైనింగ్ అధికారులు గుర్తించి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ విషయాన్ని పరిశీలించి పూర్తి వివరాలను ఇవ్వాలని రెవెన్యూ అధికారులను మైనింగ్ శాఖ కోరింది. అయితే ఇంత వరకు రెవెన్యూ అధికారుల నుంచి స్పందన లేదని చెబుతున్నారు. అదే విధంగా కావలి ప్రాంతంలోని రుద్రకోట వద్ద అక్రమంగా గ్రావెల్ తవ్వుతున్నారని మైనింగ్ అధికారులు వెళ్లగా.. రెవెన్యూ అధికారులు స్పందించలేదని ఆరోపణలున్నాయి. ఎటువంటి సమాచారం అడిగినా రెవెన్యూ శాఖ పట్టించుకోవడం లేదని, తమపై నెపం నెట్టడం సరికాదని మైనింగ్ అధికారులు చెప్పుకొస్తున్నారు.

ప్రత్యేక బృందాల తనిఖీలిలా..

జిల్లాలోని జలదంకి మండల పరిధిలోని గట్టుపల్లి, అన్నవరం ప్రాంతాల్లో అక్రమంగా మైనింగ్ జరుగుతోందని ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయి. గ్రావెల్ తవ్వేస్తున్నారని, ఒకచోట అనుమతి తీసుకుని, మరోచోట తవ్వడంతోపాటు, ఒకదానికి అనుమతి లేకుండా తవ్వేస్తున్నారని మైనింగ్ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయి. విజయవాడ నుంచి వచ్చిన ప్రత్యేక మైనింగ్ బృందాలు ఆ ప్రాంతానికి చేరుకుని కోట్లలో ఈ ప్రాంతంలో అక్రమంగా రోడ్ మెటల్ తరలినట్లు గుర్తించారు. మరో రెండు రోజుల్లో ఎంత మేర అక్రమంగా తరలింది అనే విషయాలు తెలుసుకుని క్రిమినల్ కేసులు నమోదు చేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. సైదాపురం ప్రాంతంలో కూడా ఇదే విధంగా అక్రమంగా తరలిస్తున్న వాటిపై మైనింగ్ అధికారులు దృష్టి సారించారు.

కఠిన చర్యలు తీసుకుంటాం



జిల్లాలో ఎక్కడైనా మైనింగ్‌కు సంబంధించి క్వారీలు, గ్రావెల్ ఏదైనా అనుమతులు లేకుండా తరలిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం. అక్రమంగా తరలిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చినా కఠినంగా వ్యవహరిస్తాం. కేసులు నమోదు చేస్తాం.
– శ్రీనివాసకుమార్, జిల్లా మైనింగ్ అధికారి

ఉపాధ్యాయ బదిలీలకు 5,433 దరఖాస్తులు

నెల్లూరు(టౌన్): ఉపాధ్యాయ బదిలీలకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా మొత్తం 5,433 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారిలో గ్రేడ్–2 హెడ్‌మాస్టర్లు 191 మంది, ల్యాంగేజ్ పండిట్లకు సంబంధించి హిందీ తొమ్మిది మంది, సంస్కృతం ఒకరు, తెలుగు 71 మంది, ఉర్దూ ఇద్దరు, పీఈటీలు 50 మంది, పీఎస్ హెచ్ఎం (తెలుగు) 155 మంది, ఉర్దూ ఒకరు, స్కూల్ అసిస్టెంట్లకు సంబంధించి 387 మంది, హిందీ 269 మంది, సంస్కృతం ఇద్దరు, తెలుగు 345 మంది, ఉర్దూ పదిమంది, బయోలాజికల్ సైన్స్ 322 మంది, మ్యాథ్స్ 423 మంది, పీడీలు 122 మంది, ఫిజికల్ సైన్స్ 287 మంది, సోషల్ 300 మంది, అదే విధంగా ఎస్జీటీలకు సంబంధించి 2,486 మంది బదిలీ కోసం దరఖాస్తు చేసుకున్నారు. సీనియారిటీ జాబితాను జిల్లా విద్యాశాఖ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. దానిని పరిశీలించి అభ్యంతరాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, ఈనెల 2, 3 తేదీల్లో తుదిజాబితాను విడుదల చేయనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారులు వెల్లడించారు.

నేటి నుంచి రేషన్ పంపిణీ

నెల్లూరు(పొగతోట): జిల్లాలోని కార్డుదారులకు ఈనెల ఒకటి నుంచి 17వ తేదీ వరకు రేషన్ పంపిణీ చేయనున్నట్లు డీఎస్ఓ వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 7,22,240 మంది కార్డుదారులకు 1,513 చౌకదుకాణాలు, 438 మొబైల్ వాహనాల ద్వారా రేషన్ పంపిణీ చేయనున్నామన్నారు. కుటుంబంలో ఒక్కో సభ్యుడికి ఐదు కేజీల చొప్పున ఫోర్టిఫైడ్ బియ్యం ఉచితంగా, కేజీ కందిపప్పు రూ.67కు, అరకేజీ చక్కెర రూ.17 చొప్పున కార్డుదారులకు అందజేయనున్నట్లు తెలియజేశారు. అంత్యోదయ, అన్నయోజన కార్డుదారులకు రూ.35 కేజీల బియ్యం ఇవ్వనున్నట్లు తెలిపారు.

గంటల వ్యవధిలో దంపతుల మృత్యువాత

- నరుకూరులో విషాదం



వెంకటరమణ – సుమలత దంపతులు (ఫైల్)

తోటపల్లిగూడూరు: పెళ్లితో ఒక్కటైన బంధం మరణంలోనూ వీడలేదు. కామెర్లతో బాధపడుతున్న దంపతులు గంటల వ్యవధిలోనే మృత్యువాత పడ్డారు. ఈ విషాదకర ఘటన మండలంలోని నరుకూరులో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. నరుకూరు దళిత కాలనీకి చెందిన దూపలి వెంకటరమణ (42) డ్యాన్స్ మాస్టర్. చిన్నతనంలోనే తల్లిదండ్రులు చనిపోవడంతో నరుకూరులో ఉన్న పిన్నమ్మ పాశెపు అరుణమ్మ సంరక్షణలో పెరిగాడు. 15 ఏళ్ల క్రితం విడవలూరు మండలం అలగానిపాడు గ్రామానికి చెందిన సుమలత (35)ను వెంకటరమణ వివాహం చేసుకున్నాడు. వారికి పిల్లలు లేరు. భార్యను వెంకటరమణ ఎంతో బాగా చూసుకునేవాడు. ప్రస్తుతం రమణ ఈవెంట్స్ పేరుతో అతను డ్యాన్స్ ప్రోగ్రాంలు చేస్తూ తనతోపాటు నలుగురికి ఉపాధి చూపిస్తున్నాడు. కాగాషుగర్ వ్యాధితో బాధపడుతున్న వెంకటరమణకు పదిరోజుల క్రితం పచ్చకామెర్లు సోకాయి. నెల్లూరులోని వివిధ వైద్యశాలల్లో చికిత్స పొందాడు. అయితే నయం కాకపోవడంతో కుటుంబసభ్యులు చెన్నైలోని రూత్ హాస్పిటల్‌కు తరలించారు. ఇదే సమయంలో భార్య సుమలతకు కూడా కామెర్లు రావడంతో ఆమెను కూడా అదే హాస్పిటల్‌కు తరలించారు. వెంకటరమణ ఆరోగ్యం కుదుట పడకపోవడంతో వైద్యుల సూచన మేరకు సోమవారం రాత్రి నెల్లూరు జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. డ్యాన్స్ ప్రోగాంలలో చురుగ్గా ఉండే వెంకటరమణ మృతితో మిత్రులు, అభిమానులు భారీగా నరుకూరుకు చేరుకున్నారు. బుధవారం అంత్యక్రియలు జరుగుతుండగా భార్య సుమలత ఆస్పత్రిలో మృతిచెందింది. కేవలం గంటల వ్యవధిలోనే దంపతులిద్దరూ మరణించడంతో నరుకూరులో విషాదం నెలకొంది.

నేటి నుంచి పింఛన్ల పంపిణీ

- లబ్ధిదారులు 3,05,723 మంది

నెల్లూరు(పొగతోట): జిల్లా వ్యాప్తంగా గురువారం వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీకి అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. 3,05,723 మంది లబ్ధిదారులకు అందజేసేందుకు రూ.84.95 కోట్లను విడుదల చేశారు. ఇప్పటికే సచివాలయాల పరిధిలోని వలంటీర్లకు నగదు అందజేశారు. వారు తెల్లవారుజాము నుంచే నేరుగా లబ్ధిదారులకు ఇళ్లకు వెళ్లి పింఛన్లు ఇవ్వనున్నారు. లబ్ధిదారులు అందుబాటులో ఉండాలని, ఈనెల 5వ తేదీ వరకు పెన్షన్ల పంపిణీ జరుగుతుందని డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఒక్కరోజులో 1,311 రిజిస్ట్రేషన్లు

నెల్లూరు సిటీ: జిల్లాలోని 15 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో బుధవారం ఒక్కరోజే 1,311 భూ రిజిస్ట్రేషన్లు జరిగాయి. సోమ, మంగళవారాల్లో సాంకేతిక సమస్య కారణంగా రిజిస్ట్రేషన్లకు అంతరాయం ఏర్పడింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం బుధవారం మాన్యువల్ సిస్టం ద్వారా ఈ ప్రక్రియను కొనసాగించాలని ఆదేశించింది. అయితే సాంకేతిక సమస్య పరిష్కారం కావడంతో అధికారులు రిజిస్ట్రేషన్లకు అనుమతించారు. సాధారణంగా రోజుకు 400 నుంచి 500 రిజిస్ట్రేషన్లు జరుగుతాయి. అయితే బుధవారం ఒక్కరోజే 1,311 రిజిస్ట్రేషన్లు జరగడం గమనార్హం.

ప్రజలతో మమేకం

- సర్వేపల్లిలో విజయవంతంగా గడప గడపకు మన ప్రభుత్వం
- 195 రోజుల్లో 96 వేల ఇళ్లకు వెళ్లిన మంత్రి కాకాణి
- 4,257 వినతిపత్రాల స్వీకరణ, 2,654 సమస్యలకు పరిష్కారం

➡ ప్రతి నెలా ఒకటో తేదీన వేకువ జామునే పింఛన్ సొమ్ములు అందుతున్నాయి. – ఓ అవ్వమాట

➡ ఏటా రైతు భరోసా సాయం బ్యాంకు ఖాతాలో జమవుతోంది. – ఓ రైతన్న ఆనందం

➡ మా పిల్లలు చదువులకు అమ్మఒడి, విద్యా, వసతి దీవెనలతో ఆదుకుంటున్నారు. – ఓ తల్లి సంతోషం



మనుబోలులో సంక్షేమ పథకాలు వివరిస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి (ఫైల్)

ఇలా ఒకరు కాదు ఇద్దరు కాదు.. సర్వేపల్లిలో అన్ని వర్గాల ప్రజలు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి నీరాజనాలు పట్టారు. అదే విధంగా తమ కుటుంబాల్లో వెలుగులు నింపుతున్న సంక్షేమ ప్రదాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: ఎమ్మెల్యేలు క్షేత్రస్థాయిలో పర్యటించాలి. ఇంటింటికీ వెళ్లాలి. ప్రభుత్వ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించాలి. ప్రతి సచివాలయ పరిధిలో ఎప్పటికప్పుడు సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలి. ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేలా అభివృద్ధి పనులు చేపట్టాలి అంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన సూచనలను జిల్లాలోని సర్వేపల్లి ఎమ్మెల్యే, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అక్షరాలా పాటించారు. ఆయన మంత్రిగా బిజీగా ఉన్నా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని పూర్తి చేశారు. నియోజకవర్గంలో 195 రోజులపాటు 96 వేల కుటుంబాలతో మమేకమయ్యారు. ప్రతి గడప తట్టి వారి యోగక్షేమాలు తెలుసుకోవడంతోపాటు, ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరించి అమలులో సాంకేతిక సమస్యలు ఉంటే పరిష్కరించారు. ఎక్కడైనా మౌలిక సదుపాయాలు లోపించి ఉంటే అధికారులతో మాట్లాడి సిమెంటు రోడ్లు, సైడ్ డ్రైయిన్లను నిర్మించేలా చర్యలు తీసుకున్నారు. సాంకేతిక కారణాల వల్ల పరిష్కరించలేని సమస్యలను పక్కన పెడితే మిగిలిన వాటికి పరిష్కారానికి చొరవ చూపారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 4,257 అర్జీలు రాగా, వాటిలో 2,654 అర్జీలను పరిష్కరించారు. పెండింగ్‌లో ఉన్న 1,354 వినతిపత్రాలకు ఆయా శాఖల అధికారుల ద్వారా పరిష్కరించేలా ఆదేశించారు. పరిష్కారానికి నోచుకోని 249 మంది అర్జీలను పక్కన పెట్టారు.

రూ.17.80 కోట్లతో అభివృద్ధి పనులు

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తయిన సచివాలయాలకు ప్రభుత్వం రూ.20 లక్షల వంతున అందజేసే నిధులు 89 సచివాలయాలకు కలిపి రూ.17.80 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులను ప్రజల అవసరాల మేరకు సీసీ రోడ్లు, సైడ్ డ్రైయిన్లు, మంచినీటి అవసరాలకు ఖర్చు చేస్తున్నారు. ఇప్పటికే చాలా గ్రామాల్లో రోడ్లు, డ్రైయిన్ల పనుల నిర్మాణం పూర్తి చేశారు. సచివాలయాలకు అందే నిధులే కాక మంత్రి ప్రత్యేకంగా ఎంపీ ల్యాడ్స్, నుడా, ప్రభుత్వం నుంచి అదనపు నిధులను కూడా మంజూరు చేయించి పనులు చేయిస్తున్నారు.

గడప గడపలో ప్రారంభోత్సవాలు

మంత్రి కాకాణి నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా గతంలో పూర్తి చేసుకున్న అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఇందులో కోట్లాది రూపాయలతో పూర్తి చేసిన ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ రహదారులు కూడా ఉన్నాయి. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కింద సీసీ రోడ్లు, సైడ్ డ్రైయిన్ల నిర్మాణాలు సుమారు రూ.320 కోట్లతో పూర్తి చేశారు. ఈ పనులను మంత్రి నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రారంభించారు.

పేదల సమస్యలు తెలుసుకునే అవకాశం కలిగింది

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వినూత్నంగా ప్రవేశపెట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పేదల సమస్యలు తెలుసుకునే అవకాశం కలిగింది. ప్రతి వినతిపత్రానికి పరిష్కార మార్గం చూపుతున్నాం. కార్యక్రమాన్ని నియోజకవర్గంలో విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరించారు. సీఎం మదిలో మెదిలిన కార్యక్రమం వల్ల ఎందరో పేదలకు ఉపయోగం కలిగింది. – కాకాణి గోవర్ధన్‌రెడ్డి, మంత్రి

కావలి టీడీపీలో గందరగోళం

- తెరపైకి పలువురి పేర్లు
- అభ్యర్థి విషయంలో అయోమయం



చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సుధాకర్

కావలి: మా నాయకుడెవరు?.. వచ్చే ఎన్నికల్లో పోటీ చేసేదెవరు?.. మేం ఎవరి కోసం పనిచేయాలి?.. ఇలా ఎన్నో ప్రశ్నలు కావలి నియోజకవర్గంలో తెలుగుదేశం శ్రేణులను వేధిస్తున్నాయి. అభ్యర్థి విషయంలో ఇప్పటికే పార్టీలో గందరగోళం నెలకొంది. తాజాగా పసుపులేటి సుధాకర్ అనే వ్యక్తి చంద్రబాబును కలవడంతో కార్యకర్తల్లో మరోసారి అయోమయం నెలకొంది. కావలిలో టీడీపీకి 2019 నుంచి 2021 వరకు ఇన్‌చార్జి లేడు. ఈ నేపథ్యంలో దగదర్తి మండలానికి చెందిన మాలెపాటి సుబ్బానాయుడిని ఏడాదిన్నర క్రితం ఇన్‌చార్జిగా అధిష్టానం నియమించింది. అయితే ఈయన వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు పార్టీ అభ్యర్థి కాదని, తాత్కాలికంగా పని చేస్తుంటాడని స్థానిక నాయకులు చెబుతుంటారు. సుబ్బానాయుడిని ఎవరూ సీరియస్‌గా తీసుకునే వారు కాదు.

అభ్యర్థినంటూ ప్రచారం

ఇదిలా ఉండగా ఉదయగిరి నియోజకవర్గంలోని జలదంకి మండలం బ్రాహ్మణక్రాక పంచాయతీ మజరా అగ్రహారం గ్రామానికి చెందిన దగుమాటి వెంకటకృష్ణారెడ్డి అలియాస్ కావ్య కృష్ణారెడ్డి పేరు తెరపైకి వచ్చింది. ఆయన నారా లోకేష్ పాదయాత్రకు భారీగా విరాళం ఇచ్చాడని స్థానిక నాయకులు ప్రచారం చేశారు. వచ్చే ఎన్నికల్లో కావలికి నేనే అభ్యర్థినని, సహకరించాలని కృష్ణారెడ్డి కొందరిని కోరినట్లు టీడీపీ శ్రేణులే చెప్పడం మొదలుపెట్టాయి. మహానాడులో టీడీపీకి కావ్య కృష్ణారెడ్డి రూ.కోటి విరాళం ఇచ్చినట్లు చంద్రబాబు వెల్లడించారు. దీంతో ఆయనే అభ్యర్థి అవుతాడని పార్టీ కార్యకర్తలు భావిస్తున్నారు. అయితే కృష్ణారెడ్డి స్థానికేతరుడు అవుతాడని, ఆయన్ను తమపై బలవంతంగా రుద్దడం తగదని కొందరు నాయకులు అంటున్నారు. సుబ్బానాయుడు ఏడాదిన్నరపాటు కావలిలో పార్టీ ఉనికిని కాపాడారని, ఇప్పుడు పార్టీకి సంబంధం లేని కావ్య కృష్ణారెడ్డిని పార్టీ నాయకత్వం ప్రోత్సహించడం ఏమిటని కార్యకర్తలు అంతర్మథనం చెందుతున్నారు.

బాబును కలిసి..

బీజేపీలో ఉన్నాడో లేడో కూడా తెలియని పసుపులేటి సుధాకర్ మంగళవారం హైదరాబాద్‌లో టీడీపీ అధినేత చంద్రబాబును కలిశారు. ఆయన గత అసెంబ్లీ ఎన్నికల్లో కావలిలో జనసేన అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. బీసీ కోటాలో కావలి టికెట్ తనకు ఇవ్వాలని కోరుతూ బాబును కలిసినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ పరిణామాలతో పార్టీలో గందరగోళం నెలకొంది. పార్టీతో సంబంధం లేని వారిని తీసుకొచ్చి అప్పటికప్పుడు అభ్యర్థిగా నిలబెట్టడం వల్లే కావలిలో పార్టీ పునాదులు బలహీనంగా మారాయని కార్యకర్తలు చెబుతున్నారు.

ప్రజా సంక్షేమానికి అధిక ప్రాధాన్యం



వెలుపోడులో బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

- కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

దగదర్తి (కావలి): వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి అధిక ప్రాధాన్యమిస్తోందని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. దగదర్తి మండలం వెలుపోడులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాల ద్వారా జరిగిన లబ్ధిని గణాంకాలతో సహా వివరించే బుక్‌లెట్లను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుపేదల జీవితాలను మార్చేందుకు సంక్షేమ పథకాలకు అత్యధిక నిధులు వెచ్చించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. వలంటీర్లు, సచివాలయ వ్యవస్థ ద్వారా పాలనలో నూతన శకానికి నాంది పలికారని తెలిపారు. సచివాలయాల ద్వారా ప్రజలకు అవసరమైన అన్ని సేవలు సొంత గ్రామాల్లోనే అందుబాటులోకి వచ్చాయన్నారు. నాడు - నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చేశారని తెలిపారు.

నిధులు మంజూరు చేయాలని వినతి

నెల్లూరు(దర్గామిట్ట): ఆత్మకూరు నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి కలెక్టర్ ఎం.హరినారాయణన్‌ను బుధవారం నెల్లూరులోని క్యాంప్ కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ హై లెవల్ కెనాల్ నిర్మాణంలో భాగంగా భూములిచ్చిన పడమటినాయుడుపల్లి గ్రామ రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. అదే విధంగా రిజర్వాయర్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా వైద్యశాలలో అదనపు సౌకర్యాల కల్పనకు ఏపీఎంఎస్ఐడీసీ ద్వారా నిధుల మంజూరు విషయమై చొరవ చూపాలని కోరారు. సంగం మండలం అన్నారెడ్డిపాళెంలో ఇంటి స్థలాల మంజూరుకు స్థల సేకరణ త్వరితగతిన చేపట్టాలన్నారు. ఆత్మకూరు మండలం కరటంపాడులో నూతనంగా మంజూరు చేసిన బీసీ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలకు అనుసంధానంగా ఎస్సీ వెల్ఫేర్ బిల్డింగ్‌ను మంజూరు చేయించాలని కోరారు. ఎమ్మెల్యే వెంట ఆత్మకూరు నియోజకవర్గానికి చెందిన ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులున్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

జగనన్న మళ్లీ సీఎం కావడం ఖాయం



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అనిల్

- నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అనిల్‌కుమార్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): 'ఎవరెన్ని కుట్రలు పన్నినా, ఎంతమంది కలిసొచ్చినా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావడం ఖాయం. ఇందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు' అని నెల్లూరు సిటీ ఎమ్మెల్యే డాక్టర్ పి.అనిల్‌కుమార్ అన్నారు. నెల్లూరు నగరంలోని 54వ డివిజన్ వెంకటేశ్వరపురం తదితర ప్రాంతాల్లో అనిల్ బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా? లేదా? అని ఆరా తీశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అబద్ధపు మేనిఫెస్టోని విడుదల చేసి ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి రావాలని చూస్తోందన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిలా మాటలపై ఉండి సంక్షేమ పథకాలను ప్రజలకు చేర్చాలన్న ఆలోచన టీడీపీకి లేదన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ షేక్ సఫియా బేగం, నగరపాలక సంస్థ కో-ఆప్షన్ సభ్యుడు షేక్ జమీర్, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిప్యూటీ సీటీఎం రవికాంత్ బదిలీ

నెల్లూరు సిటీ: నెల్లూరులోని ప్రధాన ఆర్టీసీ బస్టాండ్ డిప్యూటీ సీటీఎం రవికాంత్‌ను గుంటూరుకు బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో చిత్తూరు డిప్యూటీ సీఎంటీగా విధులు నిర్వహిస్తున్న ఇబ్రహీంను నియమించారు.

పొగాకు వ్యతిరేక దినోత్సవ ర్యాలీ

నెల్లూరు(అర్బన్): ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని నెల్లూరు సంతపేటలో ఉన్న బీఈడీ కాలేజీ నుంచి జిల్లా వైద్యశాఖ కార్యాలయం వరకు బుధవారం అవగాహన ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీని ప్రారంభించిన జిల్లా ఆస్పత్రుల సమన్వయాధికారి (డీసీహెచ్ఎస్) డాక్టర్ రమేష్‌నాథ్ మాట్లాడుతూ ఊపిరితిత్తులు, గొంతు, దవడ లాంటి కేన్సర్లతోపాటు అనేక జబ్బులకు మూలకారణం పొగాకే అన్నారు.చుట్ట, బీడీ, సిగరెట్, పాన్‌పరాక్, గుట్కా, ఖైనీ ఉత్పత్తులను ప్రజలు వినియోగించరాదని సూచించారు. కార్యక్రమంలో ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సుధీర్‌కుమార్, అసిస్టెంట్ ఫుడ్ కమిషనర్ వెంకటేశ్వరరావు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ బ్రిజిత, డాక్టర్లు హరిశ్చంద్ర సతీష్, భాస్కర్, శశికుమార్, నర్సింగ్ కళాశాలల విద్యార్థినులు పాల్గొన్నారు.

డీసీసీబీ ఆదాయం రూ.16.45 కోట్లు

- 13 బ్రాంచ్‌ల్లో 124 మంది సిబ్బంది నియామకానికి అనుమతి
- ఆదాయ మార్గాల్లో పయనిస్తున్న 44 సొసైటీలు
- ఛైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి



మాట్లాడుతున్న ఛైర్మన్ సత్యనారాయణరెడ్డి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) రూ.16.45 కోట్ల నికర ఆదాయంలో నడుస్తోందని డీసీసీబీ ఛైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి అన్నారు. నెల్లూరులోని గాంధీబొమ్మ సెంటర్ వద్ద ఉన్న బ్యాంకు ప్రధాన కార్యాలయంలో బుధవారం మహాజన సభ జరిగింది. ఇందులో పాల్గొన్న ఛైర్మన్ మాట్లాడుతూ జిల్లాలో 13 బ్రాంచ్‌లు ఏర్పాటు చేసేందుకు, అదనంగా 124 మంది సిబ్బంది నియామకానికి అనుమతులు వచ్చాయన్నారు. బ్యాంక్ షేర్ హోల్డర్లకు 6 శాతం డివిడెంట్ ఇవ్వడం జరుగుతుందన్నారు. గతంలో బ్యాంకు సీ కేటగిరీలో ఉండేదని, నేడు వ్యాపార లావాదేవీలు, డిపాజిట్ల సేకరణ పెరిగి 91 పాయింట్లు సాధించి బీ కేటగిరీలోకి వచ్చినట్లు చెప్పారు. దీంతో ఉద్యోగులకు 30 రోజుల వేతనాన్ని ఇన్సెంటివ్ రూపంలో ఇవ్వనున్నామన్నారు. డీసీసీబీ పరిధిలో ఉన్న 80 సొసైటీల్లో నేడు 44 సొసైటీలు ఆదాయ మార్గాల్లో పయనిస్తున్నట్లు చెప్పారు. అగ్రికల్చర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ (ఏఐఎఫ్) పథకం ద్వారా 75 సంఘాలకు రూ.153.35 కోట్ల ఆర్థిక సాయం చేసేందుకు ప్రణాళిక రూపొందించామన్నారు. పడుగుపాడు, పొదలకూరు సంఘాలతో త్వరలో మరో రెండు పెట్రోలు బంకులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. సమావేశంలో బ్యాంకు సీఈఓ డా.శంకర్‌బాబు, జీఎం సరిత, నాబార్డ్ డీడీఎం రవిసింగ్, డీసీసీబీ మాజీ ఛైర్మన్ శ్యాంసుందర్‌రెడ్డి, బ్యాంకు డైరెక్టర్లు చలమారెడ్డి, రమణయ్య, ఖంతర్ అలీ, డీజీఎంలు దయాకర్‌రెడ్డి, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

నూతన భవనాల నిర్మాణం కోసం తీర్మానం

డీసీసీబీ బ్రాంచ్‌ల కోసం నూతనంగా భవనాలను నిర్మించేందుకు పాలకమండలిలో తీర్మానం చేసినట్లు ఛైర్మన్ సత్యనారాయణరెడ్డి తెలిపారు. బ్యాంక్‌లో బుధవారం సాయంత్రం పాలకమండలి సమావేశాన్ని అత్యవసరంగా ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ జలదంకి గ్రామంలో డీసీసీబీకు ఉన్న స్థలంలో నూతన భవనాన్ని నిర్మించేందుకు తీర్మానం చేసినట్లు చెప్పారు. నాయుడుపేట, అల్లూరు ప్రాంతాల్లో నూతన భవనాలను నిర్మించేందుకు ఆర్‌బీఐ అనుమతి కోసం తీర్మానం చేశామన్నారు.

ఆటో బోల్తా

- ఒకరి మృతి
- మహిళకు తీవ్ర గాయాలు

కోవూరు: ఆటో బోల్తాపడి ఒకరు మృతిచెందగా ఓ మహిళ తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన మండలంలోని ఇనమడుగు సెంటర్ సమీపంలో బుధవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. బాబు అనే డ్రైవర్ విడవలూరు మండలంలోని ముదివర్తి నుంచి నెల్లూరుకు ఆటోలో బయలుదేరాడు. దారిలో ప్రయాణికులు ఎక్కారు. ఇనమడుగు సెంటర్ సమీపంలో వచ్చే సరికి గాలికి ప్లాస్టిక్ కవర్ ఆటో మీద పడింది. వేగంగా వెళ్తుండగా డ్రైవర్ ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో ఆటో బోల్తా పడి కొద్దిదూరం ప్రయాణికులను ఈడ్చుకెళ్లింది. ఈ ప్రమాదంలో అల్లూరు మండలం పురిణి ప్రాంతానికి చెందిన మర్రిపాటి వెంకటేశ్వర్లు (70) అక్కడికక్కడే మృతిచెందాడు. సులోచన అనే ప్రయాణికురాలి కుడి చెయ్యి మూడు వేళ్లు తెగిపోయాయి. మిగిలిన వారు ప్రమాదం నుంచి బయటపడ్డారు. వెంకటేశ్వర్లు పెయింట్ మేస్త్రీగా పని చేస్తున్నాడు. ముదివర్తిలో ఆయన రెండో కుమార్తె ఉంది. కొన్ని సంవత్సరాల నుంచి అతను అక్కడే ఉంటున్నాడు. రోజూ కూలీలను పనులకు తీసుకెళ్తుంటాడు. దినచర్యలో భాగంగా పెయింట్ పనికి బయలుదేరి మృత్యువాత పడ్డాడు. సమాచారం అందుకున్న కోవూరు ఎస్సై రమ్య ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని కోవూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సులోచనను నెల్లూరులోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు.



వెంకటేశ్వర్లు మృతదేహం

ఐదుగురిపై పీడీ యాక్ట్ ప్రయోగం

- త్వరలో మరికొందరిపై..

నెల్లూరు(క్రైమ్): గంజాయి రహిత జిల్లానే లక్ష్యంగా ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి చర్యలు చేపట్టారు. పక్కా ప్రణాళికతో గంజాయి అక్రమ రవాణా, విక్రయాలపై దాడులు చేస్తూ అక్రమార్కులను కటకటాల వెనక్కి పంపుతున్నారు. అయినా కొందరిలో మార్పు రావడంలేదు. ఈ క్రమంలో బుధవారం ముగ్గురు మహిళలు, ఇద్దరు పురుషులపై పీడీ యాక్ట్ ప్రయోగించారు. మరికొందరిపై యాక్ట్ నమోదు చేసేందుకు కసరత్తు జరుగుతోంది.

వీరిపైనే..

- నెల్లూరు కపాడిపాళేనికి చెందిన అరవ రాజమ్మపై ఎస్ఈబీ నెల్లూరు-1 స్టేషన్ పరిధిలో గంజాయి విక్రయాలు, అక్రమ రవాణాకు సంబంధించి పది, ఇంకా స్థానిక పోలీస్‌స్టేషన్లలో కేసులున్నాయి.
- కపాడిపాళేనికి చెందిన షేక్ సిరాజ్‌పై ఎస్ఈబీ నెల్లూరు-1 స్టేషన్ పరిధిలో ఏడు కేసులున్నాయి.
- కపాడిపాళేనికి చెందిన షేక్ సుభానీపై నాలుగు, ఇంకా స్థానిక పోలీస్‌స్టేషన్లలో కేసులున్నాయి.
- నెల్లూరు వెంగళరావ్‌నగర్‌కు చెందిన సీహెచ్ వెంకటేశ్వర్లుపై ఐదు కేసులున్నాయి.
- నెల్లూరు కపాడిపాళేనికి చెందిన షేక్ ముంతాజ్‌పై 13, ఇంకా స్థానిక పోలీస్‌స్టేషన్లలో కేసులున్నాయి.

నేరప్రవృత్తి వీడాలి



నేరస్తుల కదలికలపై నిరంతరం నిఘా ఉంటుంది. నేర ప్రవృత్తిని వీడాలి. లేని పక్షంలో పీడీ యాక్ట్ నమోదు చేస్తాం. అవసరమైతే జిల్లా బహిష్కరణకు వెనుకాడేదిలేదు. ప్రజలు తమ ప్రాంతాల్లో గంజాయి అక్రమ రవాణా, విక్రయాలు, సేవనం జరుగుతున్నట్లు గుర్తిస్తే 14500, డయల్ 100, 112కు లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందిస్తే తగిన చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి, ఎస్పీ

- ఐదుగురిపై సస్పెక్టెడ్ షీట్లు కూడా ఉన్నాయి.

కడప కేంద్ర కారాగారానికి తరలింపు

అరవ రాజమ్మ, సిరాజ్, సుభానీ, ముంతాజ్‌తో పాటు జిల్లా కేంద్ర కారాగారంలో రిమాండ్‌లో ఉన్న వెంకటేశ్వర్లుకు ఎస్ఈబీ, పోలీసు అధికారుల బృందం నోటీసులు అందజేశారు. వారిని కడప కేంద్ర కారాగారానికి తరలించారు.

రేపటి నుంచి పది సప్లిమెంటరీ పరీక్షలు

- జిల్లాలో 43 సెంటర్ల ఏర్పాటు
- హాజరుకానున్న 8,400 మంది విద్యార్థులు
- 350 మంది ఇన్విజిలేటర్ల నియామకం

నెల్లూరు(టౌన్): పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను జూన్ 2 నుంచి 10వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా మొత్తం 43 సెంటర్లు ఏర్పాటు చేశారు. మొత్తం 8,400 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకు జరుగుతాయని. పరీక్ష సమయానికి గంట ముందు విద్యార్థులను కేంద్రాలోకి అనుమతించనున్నారు. 43 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 43 మంది డిపార్ట్‌మెంట్ అధికారులను, ఇంకా 350 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. ఇప్పటికే ప్రశ్నపత్రాలను సమీపంలోని పోలీస్ స్టేషన్లలో భద్రపరిచారు. పరీక్షలను పక్కాగా నిర్వహించేందుకు జిల్లా విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. మాస్ కాపీయింగ్‌ను అరికట్టేందుకు ఉండేందుకు నాలుగు ఫ్లయింగ్, సిటింగ్ స్క్వాడ్ బృందాలను నియమించారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయనున్నారు. అదే విధంగా ఆ ప్రాంతంలో ఉన్న జెరాక్స్ సెంటర్లను మూసివేయాలని ఆదేశించారు. కేంద్రాల్లో మెడికల్ కిట్‌తోపాటు ఏఎన్ఎంను అందుబాటులో ఉంచుతారు. పరీక్షలను డీఈఓ గంగా భవాని పర్యవేక్షించనున్నారు.

8 రౌండ్ల పొగాకు వేలం పూర్తి

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): మర్రిపాడు మండలం డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో బుధవారానికి 8 రౌండ్ల పొగాకు వేలం పూర్తయింది. 57 లక్షలకు పైగా కిలోల ఉత్పత్తులను రైతుల నుంచి కొనుగోలు చేసినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. రూ.113 కోట్లకు పైగా వ్యాపారం జరిగిందన్నారు. 47,379 బేళ్లు వేలానికి కేంద్రానికి తీసుకురాగా, 44,629 బేళ్లను 17 కంపెనీలకు చెందిన బయ్యర్లు కొనుగోలు చేశారన్నారు. కిలో పొగాకుకు సగటున రూ.196.91, అత్యధికంగా రూ.201, అత్యల్పంగా రూ.174 ధర నమోదైనట్లు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): మండలంలోని పొంగూరులో విద్యుత్ షాక్‌తో నల్లాని రమేష్‌బాబు (47) అనే వ్యక్తి మృతిచెందిన ఘటన బుధవారం తెల్లవారుజామున జరిగింది. పోలీసులు, కుటుంబసభ్యుల కథనం మేరకు.. గాలివాన కారణంగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అతను లూజ్ కనెక్షన్ కారణంగా కరెంట్ పోయిందని భావించి వైర్లను సరిచేసేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో ఒక్కసారిగా విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందాడు. రమేష్‌బాబు కొద్దిపాటి పొలంలో పొగాకు సాగు చేస్తుంటాడు. భార్య, ఇద్దరు పిల్లలున్నారు. కుటుంబ పెద్ద మరణంతో వారు కన్నీరుమున్నీరుగా రోదిస్తున్నారు. సమాచారం అందుకున్న మర్రిపాడు పోలీసులు మృతదేహాన్ని ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోస్టుమార్టం చేయించి కుటుంబసభ్యులకు అప్పగించారు.



రమేష్‌బాబు (ఫైల్)



పొదలకూరు నిమ్మధరలు (కిలో)



పెద్దవి	: రూ.50
సన్నవి	: రూ.20
పండ్లు	: రూ.15

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	: 158
లేయర్ (లైవ్)	: 98
బ్రాయిలర్ చికెన్	: 270
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 300
లేయర్ చికెన్	: 167

సర్వేపల్లి కాలువలో మృతదేహం

నెల్లూరు(క్రైమ్): సర్వేపల్లి కాలువలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గమనించి బాలాజీనగర్ పోలీసులకు సమాచారం అందించారు. బుధవారం ఉదయం ఇన్‌స్పెక్టర్ రాములునాయక్, ఎస్సై సుమన్ ఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల సహకారంతో మృతదేహాన్ని వెలికి తీయించారు. మృతుడి వయసు సుమారు 40 నుంచి 45 ఏళ్లలోపు ఉండొచ్చని భావిస్తున్నారు. రెడ్ కలర్ ఫుల్ హ్యాండ్స్ చొక్కా, బ్లాక్ కలర్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. ఎడమ చేతిపై సుమిత్ర, కుడి చేతిపై సుభాషిణి పేర్లతో పచ్చబొట్లు ఉన్నాయి. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. అప్పటికే మృతదేహం కుళ్లిపోయి దుర్వాసన వస్తోంది. దీనిని బట్టి చనిపోయి రెండురోజులై ఉండొచ్చని పోలీసులు చెబుతున్నారు. కాగా ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతిచెందాడా? లేదా ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా? అని తెలియరావాల్సి ఉంది. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి ఎస్సై కేసు నమోదు చేశారు. మృతుడి వివరాలు తెలిసిన వారు బాలాజీనగర్ పోలీసులను సంప్రదించాలని కోరారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై సుమన్